సాక్షి వరంగల్
బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024



వరద బాధితులకు ప్రభుత్వం అండ

వరద బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. వరద బాధిత కుటుంబానికి రూ.5లక్షల చెక్కు అందించారు. - 8లో▸



కేయూలో భూముల పరిశీలన

కేయూ భూములు ఆక్రమణకు గురైనట్లు ఆరోపణల ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. - 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
32^0 /24^0

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

ఓటరు జాబితా రెడీ!

- జిల్లాలోని 325 గ్రామ పంచాయతీల్లో 2,828 వార్డులు
- 3,88,838 మంది ఓటర్లు
- 13న ముసాయిదా జాబితా ప్రకటన
- మారనున్న రిజర్వేషన్లు..!

గీసుకొండ: స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వ యంత్రాంగం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసే ప్రక్రియను చేపట్టారు. గత నెల 26 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కాగా ఆయా పంచాయతీల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు సహాయ ఎన్నికల అధికారులుగా ఉన్న ఎంపీడీఓలు, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, మల్టీపర్పస్ వర్కర్లు ఓటరు జాబితాను ఇటీవల సిద్ధం చేశారు. ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలోని ఓటర్లను ఆ పంచాయతీలో ఉన్న వార్డులతో భాగించి ఈ జాబితాలను తయారు చేశారు. గడిచిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాను ప్రాతిపదికగా తీసుకుని ఈ విభజన చేశారు. వార్డుల విభజన చేసేటప్పుడు ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు ఒకే వార్డులో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే కొత్తగా వచ్చే ఓటర్లు ఎవరైనా ఉంటే వారు స్థానికంగా నివాసం ఉండే వార్డుకు మాత్రమే అనుసంధానం చేస్తామని, చివరి వార్డుకు కాదని ఇటీవల రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి స్పష్టం చేసిన మేరకు జాబితాలను తయారు చేశారు.

11 గ్రామీణ మండలాలు..

జిల్లాలో గ్రేటర్ వరంగల్ నగరం, నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీలతో పాటు 11 గ్రామీణ మండలాలు ఉన్నాయి. గ్రామీణ మండలాల్లోనే గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను నిర్వహిస్తారు. ఈ లెక్కన జిల్లాలో 325 గ్రామ పంచాయతీలుండగా వాటిలో 2,828 వార్డులున్నాయి. వాటిలో మొత్తం 3,88,838 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నెల 13న ప్రతీ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఆ గ్రామానికి సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. అనంతరం 14వ తేదీ నుంచి 21 వరకు ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 26వ తేదీలోగా జిల్లా పంచాయతీ అధికారి వాటిని పరిష్కరించి.. 28న గ్రామపంచాయతీల తుది ఓటర్ల జాబితాను వార్డుల వారీగా ప్రకటిస్తారు. ఓటర్ల జాబితా ప్రచురణకు ఇచ్చిన ప్రకటనలో పేర్కొన్న విధంగా 18న జిల్లా స్థాయి, 19న మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. ఓటరు ముసాయిదాలో లోపాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకొస్తే వారు పరిష్కరిస్తారని ఎన్నికల కమిషనర్ ఇటీవల ప్రకటించారు.



గీసుకొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్న అధికారులు (ఫైల్)



మండలం, జీపీల వారీగా ఓటర్లు..

మండలం	గ్రామ పంచాయతీలు	వార్డులు	ఓటర్లు
చెన్నారావుపేట	30	258	31,496
దుగ్గొండి	34	282	36,772
గీసుకొండ	21	188	28,331
ఖానాపురం	21	184	27,768
నల్లబెల్లి	29	252	30,938
నర్సంపేట	27	238	33,149
నెక్కొండ	39	340	45,633
పర్వతగిరి	33	288	39,142
రాయపర్తి	40	342	45,557
సంగెం	33	286	41,168
వర్ధన్నపేట	18	170	28,884
మొత్తం	325	2828	3,88,838

రిజర్వేషన్లు మారేనా?

గ్రామపంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు మారుతాయని రాష్ట్ర ఎన్నికల సంఘం అంటోంది. వాస్తవానికి రెండు టర్మ్‌ల వరకు రిజర్వేషన్లు మారకుండా గత ప్రభుత్వం చట్టం చేసిన విషయం తెలిసిందే. ఈసారి రిజర్వేషన్లు మారుతాయని, సామాజిక వర్గాల రిజర్వేషన్లు మాత్రం ఇటీవల సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం 50 శాతం మించ రాదనే స్పష్టత ఉందని ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. స్థానిక సంస్థల రిజర్వేషన్ల ఖరారు విషయం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిది. ప్రభుత్వపరంగా ఇచ్చే రిజర్వేషన్లు తాము అమలు చేయాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం క్లారిటీ ఇచ్చింది. క్షేత్ర స్థాయిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభా దామాషాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్ల మార్పు చోటు చేసుకుంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల స్పష్టం చేసింది. ఈ క్రమంలో జిల్లాలో గతంలో ఉన్న విధంగా రిజర్వేషన్లు ఉండవని తెలుస్తోంది.

28న తుది జాబితా..

వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితాలు తయారైనప్పటికీ కొత్త ఓటరుగా తహసీల్దార్ కార్యాలయం లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు ఈ అవకాశం ఉంది. ఈ నెల 13న సిద్ధం చేసిన ముసాయిదా ఓటరు జాబితాను జీపీ కార్యాలయాల్లో ప్రకటించిన తర్వాత అభ్యంతరాలను స్వీకరించి, సరిచేసి తుది జాబితాను ఈ నెల 28న ప్రకటిస్తాం.

- రాంరెడ్డి, ఇన్‌చార్జ్ డీపీఓ, జెడ్పీ సీఈఓ

న్యూస్‌రీల్

జాతీయ సైన్స్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



సంగెం: జాతీయ సైన్స్ పోటీల్లో గవిచర్ల మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ముజుబూర్ రహమాన్ తెలిపారు. గైడ్ టీచర్ ఆర్.రాజప్రభు పర్యవేక్షణలో 9వ తరగతి విద్యార్థులు ఇ.వర్షిక్, సీహెచ్.అభిరామ్ తయారు చేసిన హైడ్రో బైసికిల్ రాష్ట్రస్థాయి ప్రదర్శనలో జాతీయస్థాయికి ఎంపికైందని పేర్కొన్నారు. ఈ నెల 9న బెంగుళూరులో జరిగిన జాతీయ సైన్స్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన హైడ్రో బైసికిల్ అందరిని ఆకర్షించింది. అంతర్జాతీయ షెల్ కంపెనీ అధికారులు, కర్ణాటక రాష్ట్ర విద్యా మంత్రితోపాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధుల నుంచి విద్యార్థులు ప్రశంసపత్రం, మెడల్ అందుకున్నారని తెలిపారు. విద్యార్థులు వర్షిక్, అభిరామ్, గైడ్ టీచర్ రాజప్రభును ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఇంటర్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

వరంగల్: ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంచినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బోర్డు నిర్దేశించిన గడువు ప్రకారం అడ్మిషన్లు ఈ నెల 7వ తేదీతో ముగిశాయని పేర్కొన్నారు. కానీ, ఇటీవల కురిసిన భారీ వర్షాలు, విద్యార్థుల తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు గడువు తేదీ ఈ నెల 15వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. అన్ని యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



చెన్నారావుపేట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎన్‌వీబీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్‌సింగ్ సూచించారు. అక్కల్‌చెడ గ్రామంలో మంగళవారం ఎన్‌సీడీ ప్రాజెక్టు అధికారి డాక్టర్ గోపాల్‌రావుతో కలిసి ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జ్వరపీడితులతో మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు, గ్రామ యువజన సంఘాలు, మహిళా సంఘాలతో సమన్వయం చేసుకుని పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సరోజ, సీహెచ్ఓ భద్రయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు రామేల్, కీర్యా, వైద్య సిబ్బంది కుండె శివాజీ, సురేందర్, వెంకట్‌రెడ్డి, లింగమూర్తి, సారియా, రాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణపై దృష్టి సారించాలి : సీడీపీఓ



నల్లబెల్లి: మాతాశిశు సంరక్షణపై ఐసీడీఎస్ ఉద్యోగులు,ఆశ వర్కర్లు దృష్టి సారించాలని నర్సంపేట సీడీపీఓ మధురిమ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సీడీపీఓ మాట్లాడారు. వయస్సు, ఎత్తుకు తగిన బరువు లేని పిల్లలను గుర్తించి ఎంజీఎంలోని పోషకాహార పునరావాస కేంద్రానికి తరలించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. వైద్యసిబ్బంది ప్రభుత్వ పాఠశాలల్లో రక్తహీనత శిబిరాలు నిర్వహించి, విద్యార్థులకు పోషకాహారంపై సంపూర్ణ అవగాహన కల్పించాలని, పోషణ్ అభియాన్ మాసోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. నల్లబెల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పోరిక రవీందర్‌నాయక్, ఏసీడీపీఓలు శ్రీదేవి, హేమలత,నల్లబెల్లి క్లస్టర్ సూపర్‌వైజర్ అరుణ, పీహెచ్ఎస్ కోమల, హెచ్‌వీ హెప్సిబా,షేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ప్రశాంతి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

కాజీపేట అర్బన్: ప్రోగ్రాస్ ఆఫ్ ఆర్ట్ బడ్స్–24 ఇంటర్నేషనల్ డ్రాయింగ్ పోటీల్లో కేవీ (కేంద్రీయ విద్యాలయ) విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. డ్రాయింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్స్, జ్యూరీ అవార్డులు సాధించిన విద్యార్థులను, డ్రాయింగ్ టీచర్ అన్నబత్తుల వెంకన్నను కడిపికొండలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ ఆవరణలో ప్రిన్సిపాల్ సుభాషిణి మంగళవారం అభినందించారు.

విద్యార్థినులు, తల్లులను హాస్టల్‌లోకి రానివ్వాలి

- రోడ్డు పక్కనే గంటల తరబడి ఎందుకు ఉంచారు?
- జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై కలెక్టర్ ఆగ్రహం



గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మంగతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

నర్సంపేట రూరల్: విద్యార్థినులు, వారి తల్లులు గంటల తరబడి గేటు బయట, రోడ్డు పక్కన ఎలా ఉంటారని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మంగపై కలెక్టర్ సత్య శారద ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వాపురం శివారులోని గురుకుల పాఠశాలను మంగళవారం కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ ఆ దారిలోనే నర్సంపేట వైద్య కళాశాల తనిఖీకి వెళ్తుండగా.. ఓ విద్యార్థిని, ఆమె తల్లి వసతి గృహం బయట ఉండగా చూశారు. తిరుగు ప్రయాణంలో మళ్లీ కలెక్టర్‌కు వారు బయటే కనిపించారు. కలెక్టర్ వారితో మాట్లాడి హాస్టల్‌లోకి వెళ్లి ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి తల్లులు బయట ఉన్నప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. విద్యార్థులు, తల్లులను లోపలికి అనుమతించి ప్రత్యేక గదిలో కూర్చోబెట్టాలని ఆదేశించారు. అదే విధంగా ఫిర్యాదు బాక్స్‌లోని ఫిర్యాదులను చదివి ఉపాధ్యాయులకు, పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం భోజనశాలను పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి పుష్పలత, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో తరగతుల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

వైద్య కళాశాలలో తరగతుల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్య శారద అన్నారు. నర్సంపేట వైద్య కళాశాల, జిల్లా ఆస్పత్రి భవనాలను మంగళవారం కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. సిబ్బందిని నియమించి, వసతులు కల్పించాలని ఆదేశించారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమాధికారి పుష్పలత, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు సాగు చేయాలి



నర్సంపేట రూరల్ : ముగ్ధుంపురం గ్రామ శివారులో పంటలను పరిశీలిస్తున్న ప్రతినిధులు

ఖానాపురం: ఆరుతడి పద్ధతిలోనే పంటలు సాగు చేయాలని స్పెయిన్ దేశంలోని బ్రిడ్జ్ ఇంపాక్ట్ సర్వీసెస్ అండ్ మిట్టి ల్యాబ్స్ ప్రతినిధులు చిన్‌మై, బెంజ్‌మెన్, కియాగో, నెట్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ధర్మరావుపేటలో మంగళవారం పలు పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వరి పంటలో ఎక్కువ నీరు నిల్వ ఉండడంతో మిథేన్ గ్యాస్ వెలువడుతుందన్నారు. వరి పంటలో ఏడబ్ల్యూడీ (ఆల్టర్‌నేట్ మిథేన్ డ్రై) పైపులను ఏర్పాటు చేసుకుని గ్యాస్‌ను నివారించాలని సూచించారు. ఆరుతడి పంటలు అధికంగా సాగు చేసుకుంటే మిథేన్ గ్యాస్‌ను పంటల్లో నివారించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన గణనాథుల వద్దకు వెళ్లి పూజలు చేశారు.ఈ సందర్భంగా రైతులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బ్రిడ్జ్ ఇంపాక్ట్ సర్వీస్ మేనేజర్ రాజు, ఎఫ్ఓ రాజు, జేఎఫ్ఓ మాధురి, చిరంజీవి, రైతు కత్తాల వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్ధుంపురంలో పంటల పరిశీలన..

నర్సంపేట రూరల్: మండలంలోని ముగ్ధుంపురం శివారులో పంటలను బ్రిడ్జ్ ఇంపాక్ట్ సర్వీసెస్ అండ్ మిట్టి ల్యాబ్స్ ప్రతినిధులు పరిశీలించారు. రైతులతో సమావేశం నిర్వహించి వారు మాట్లాడుతూ ఏడబ్ల్యూటీ పైపులతో మిథేన్ గ్యాస్‌ను నివారించవచ్చని సూచించారు.

పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వీడాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



గీసుకొండ : మాట్లాడుతున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ: పంచాయతీ కార్యదర్శుల పనితీరు బాగా లేదని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగుసార్లు సమీక్షలు నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించినా వారిలో మార్పు రాలేదన్నారు. వారం రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యదర్శులే తనకు బలం, బలగం అని, వారు బాగా పనిచేస్తేనే తనకు మంచి పేరు వస్తుందని, ఇక నుంచైనా నిర్లక్ష్యాన్ని వీడాలని హితవు పలికారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కమలాకర్, ఎంపీఓ ఎ.ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

సంగెం: మండల సమగ్ర అభివృద్ధి కోసం అన్ని శాఖల అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తించేలా అధికారులు సహకరించాలని, గ్రామాల వారీగా నాటిన మొక్కల నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వైకుంఠధామాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి ప్రహరీలు నిర్మించాలని, రేషన్ షాపులు ఉదయం 7 గంటలకు తెరవాలని, షాపులకు ట్రేడ్‌లైసెన్స్‌లు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మండల ప్రత్యేకాధికారి వేదవతి, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు త్వరలో ఏకీకృత రూల్స్

- హెల్త్‌కార్డులు ఇచ్చే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పిస్తాం
- పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి



ధర్మారంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి

గీసుకొండ: ప్రభుత్వ ఉపాధ్యాయులకు త్వరలో ఏకీకృత రూల్స్ సాధిస్తామని, అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు ఇచ్చే విధంగా ప్రభుత్వాన్ని ఒప్పిస్తామని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన పీఆర్‌టీయూ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు ద్వారా జీతాలు ఇప్పిస్తామని, కేజీబీవీ టీచర్లకు టైం స్కేల్, పీజీ హెచ్ఎంలకు ప్రమోషన్లు వచ్చేలా కృషి చేస్తామని, 2003 డీఎస్సీ వారికి పాత పింఛన్ అమలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్, ప్రతినిధులు సూరం శంకర్‌రావు, తుమ్మి దయాకర్, రాజు, పట్టాభి, పలు మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల కార్యవర్గం

పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కల్లూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా మార్త శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులుగా బొల్లం రవి, ఎన్.ఇందిరాదేవి, ఉపాధ్యక్షులుగా ఎన్.మాలతి, ఎం.బాలరాజు, కార్యదర్శులుగా జి.పద్మజ, ఎం.స్వాతి ఎన్నికైనట్లు సంఘం నాయకులు ప్రకటించారు. ఎన్నికల పర్యవేక్షకులుగా విజయ్, రాజేందర్ వ్యవహరించారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

- డుండి గణపతిగా అలంకరణ

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయంలో కొనసాగుతున్న గణపతి నవరాత్రి మహోత్సవాలు మంగళవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. మూలమహాగణపతిని డుండి గణపతిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు రుద్రేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం, పూజలు నిర్వహించారు. మూలగణపతికి కోనేరు నీటితో జలాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. వేముల సత్యమూర్తి–ఉమాదేవి సౌజన్యంతో భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేపట్టారు.

బోను.. కోతులు పడేను!

కోతులు పడుతూ ఉపాధి పొందుతున్న తిరుపతి వాసులు

- ఫ్యాన్సీ స్టోర్ బిజినెస్‌లో నష్టం రావడంతో రూటు మార్చిన యువత
- ఖానాపురం మండలం ధర్మరావుపేటలో 145 వానరాల పట్టివేత



ధర్మరావుపేటలో బోనులో బంధించిన కోతులు

సాక్షి, వరంగల్ / ఖానాపురం: కరోనా దెబ్బతో తిరుపతికి చెందిన యువకులు దినేశ్, జోయల్ కోతులు పడుతూ ఉపాధి పొందుతున్నారు. తిరుమలలో 'ఫ్యాన్సీ స్టోర్' వ్యాపారం చేయగా వారికి నష్టాలు వచ్చాయి. దీంతో తెలంగాణలో కోతులు పడుతూ రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. ఒక్కో కోతికి రూ.350 నుంచి రూ.రెండువేల వరకు వసూలు చేస్తున్నారు. కూరగాయలు, పండ్లు, పల్లీలను బోన్లలో పెట్టి కోతులను రప్పించి బోన్లు మూసివేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో గాయాలైనా లెక్కచేయకుండా గ్రామాల్లో వానరాల బెడద లేకుండా చేస్తున్నారు. తాజాగా ఖానాపురం మండలం ధర్మరావుపేట గ్రామంలో 145 కోతులను బోన్ల ద్వారా పట్టుకున్నారు. ఒక్కో కోతికి రూ.350 తీసుకొని వీటిని ట్రాలీలో ఎక్కించుకొని ములుగు జిల్లా అటవీ ప్రాంతంలో వదిలేశారు. ఈ సందర్భంగా ఫ్యాన్సీ స్టోర్ వ్యాపారం నుంచి కోతులు పట్టడం వైపు ఎలా వచ్చారో వారు 'సాక్షి'కి తెలిపారు.

బోన్లతో పట్టుకుంటున్నాం..



ఇప్పటివరకు ఖమ్మం, కొత్తగూడెం, వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్, కామారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో కోతులు పట్టాం. ఇందుకు ప్రత్యేకంగా తయారు చేయించుకున్న బోన్లను ఉపయోగిస్తున్నాం. బోన్లలో పల్లికాయలు, అరటిపండ్లు, పల్లీలు, కూరగాయలు పెట్టి కోతులు రాగానే పట్టుకుంటున్నాం. బోన్లకు ఇరువైపులా ఇద్దరం ఉండి ఎవరి వైపు వస్తున్నాయో గమనించి తదనుగుణంగా బోన్లను మూసివేస్తున్నాం. కోతులను సమీపంలో అటవీ ప్రాంతం వదిలేసేలా గ్రామస్తులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం. కొన్నిసార్లు మేమే తీసుకెళ్లి అభయారణ్యంలో వదిలేస్తున్నాం. కోతులు అధికంగా ఉన్న ప్రాంతంలో ఒక్కో కోతికి రూ.350 నుంచి రూ.500, తక్కువగా ఉన్న చోట రూ.1,000 నుంచి రూ.2,000 వరకు తీసుకుంటున్నాం. కోతుల వల్ల గాయాలైతే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి టీటీ ఇంజక్షన్లు వేయించుకుంటున్నాం. మూడేళ్ల క్రితం ఖానాపురం మండలం ధర్మారావుపేట గ్రామానికి మూడేళ్ల క్రితం వచ్చాం. మళ్లీ ఇప్పుడు కోతులు పట్టేందుకు వచ్చాం. 93926 61723, 63621 67774 నంబర్లలో మమ్ములను సంప్రదించవచ్చు.

- జోయల్, తిరుపతి వాసి

అత్తామామ నుంచి కోతులు పట్టడం నేర్చుకున్న..



అత్తామామ దేవస్తాన్, హంసలేఖ 20 ఏళ్లుగా కోతులు పడుతూ ఉపాధి పొందుతున్నారు. తిరుపతి పట్టణంతోపాటు వివిధ ప్రాంతాల్లో కోతులు పడుతుండేవారు. అయితే, కరోనా సమయంలో ఫ్యాన్సీ స్టోర్ వ్యాపారం దెబ్బతినడంతో నాకు కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో మా అత్తామామతో కొత్తగూడెం పట్టణానికి వచ్చి 10 రోజులపాటు కోతులు పట్టడం నేర్చుకున్నా. ఇలా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ గ్రామాల్లో కోతులు పట్టేందుకు మాకు పిలుపు వచ్చింది. మేం కోతులు పడుతున్న దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధిస్తున్న ఆయా గ్రామాల ప్రజలు యూట్యూబ్‌లో నిక్షిప్తం చేయడంతోపాటు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారు. ఇలా మాకు తెలంగాణలోని వివిధ గ్రామాల నుంచి కోతులు పట్టేందుకు ఫోన్లు వస్తున్నాయి.

- దినేశ్, తిరుపతి వాసి

విరాళాలు సేకరించి పట్టిస్తున్నాం..



గ్రామంలో కోతుల బెడద ఎక్కువై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల వెంట, ఇళ్ల వద్ద ప్రజలను గాయపరుస్తున్నాయి. దీంతో కోతులను బంధించి అడవుల్లో వదిలివేయాలని నిర్ణయించాం. రాజకీయ పార్టీల నాయకులు, మహిళా సంఘాలు, గ్రామ ప్రజలంతా విరాళాలు సేకరిస్తున్నాం. సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలుసుకుని నిధులు సేకరించి కోతులను పట్టి అడవుల్లో వదిలేస్తున్నాం.

- తోట రవి, ధర్మరావుపేట

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కాశిబుగ్గ: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. కాశిబుగ్గ యూపీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కాశిబుగ్గ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డెంగీ వ్యాధిగ్రస్తుడి ఇంటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఆయిల్‌పామ్ మొక్కలు పెంచాలి



ఆయిల్‌పామ్ రైతులతో మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

పర్వతగిరి: రైతులు ఆయిల్‌పామ్ మొక్కలు పెంచాలని పెంచాలని తెలంగాణ రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సూచించారు. కొంకపాక గ్రామంలో రైతు మోహన్‌రావు పామాయిల్ తోటను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో 30 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలను పెంచాలని లక్ష్యంగా నిర్ణయించామని, 7వేల ఎకరాల్లోనే సాగుచేస్తున్నారని తెలిపారు. మరింత మంది రైతులు ముందుకు వచ్చి ఆయిల్‌పామ్ తోటలపై దృష్టి సారించాలని కోరారు. ప్రస్తుతం రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తొర్రూరులో పామాయిల్ మిల్లును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

పరిశోధన పత్రం సమర్పణ



కేయూ క్యాంపస్ : చెన్నైలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈనెల 2 నుంచి 7వ తేదీ వరకు ప్రతిష్టాత్మక 18వ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ థర్మల్ ఎనాలిసిస్ అండ్ కాలోరిమెట్రీ 2024 సదస్సు జరిగింది. ఇందులో కేయూ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న పాల్గొని పరిశోధన పత్రం సమర్పించారు. అలాగే ఒక టెక్నికల్ సెషన్‌లోనూ పాల్గొన్నారు.

క్షణికావేశం..

- తమ్ముడిని స్క్రూడ్రైవర్‌తో పొడిచిన అన్న
- పరిస్థితి విషమం..ఎంజీఎంకు తరలింపు

నర్సంపేట రూరల్: తన మాటలు వినడం లేదనే క్షణికావేశంలో అన్న.. తమ్ముడిని స్క్రూడ్రైవర్‌తో పొడిచాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం నర్సంపేటలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేటలోని రాంనగర్ కాలనీకి చెందిన దొడ్డ దేవేందర్, అమరేందర్ అన్నదమ్ములు. కొన్ని నెలల క్రితమే వీరి తల్లిదండ్రులు మృతిచెందారు. వీరు చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. అయితే తన మాటలు వినడం లేదనే కారణంపై దేవేందర్, అమరేందర్ మధ్య గొడవ జరిగింది. ఆ గొడవ చిలికిచిలికి గాలివానలా మారింది. దీంతో క్షణికావేశానికి లోనైనా దేవేందర్ తమ్ముడు అమరేందర్‌ను స్క్రూడ్రైవర్‌తో పొట్టలో పొడిచాడు. స్థానికులు గమనించి నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు ఎంజీఎంకు రెఫర్ చేశారు. ఈ ఘటనపై నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తిని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి

మామునూరు: పాడి పరిశ్రమలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న అన్నారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం భవనంలో పశువైద్య శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో మంగళవారం శాస్త్రీయ పద్ధతిలో పాడి పశువుల పెంపకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పాడిపశువుల పెంపకం, నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వర్షాకాలం, చలికాలంలో చూడి పశువుల్లో హార్మోన్ల అసమతుల్యత ఏర్పడి ఒత్తిడితో అనేక రకాల రోగాలకు గురవుతుంటాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శశాంక్, సాయికిరణ్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు
బ్రాయిలర్ చికెన్ రేటు
స్కిన్‌లెస్ చికెన్ రేటు
Cell: 9989299661

ఆంతర్యమేమిటో



ఫార్మసీ కళాశాలల్లో తనిఖీల నివేదికలను వెల్లడించని అధికారులు



- కేయూ పరిధిలో గతంలో మూడు కళాశాలలకు 'ఎం ఫార్మసీ' కోర్సుకు అనుమతికి నిరాకరణ
- ఆ మూడింట్లో మరోసారి తనిఖీలు చేపట్టిన అధికారుల బృందం
- ఉన్నది ఉన్నట్లు రిపోర్టు రూపొందించొచ్చు కదా అని ప్రశ్నిస్తున్న పలువురు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పలు ప్రైవేటు ఫార్మసీ కళాశాలల్లో అధికారుల తనిఖీలు చేపట్టారు. ఇందులో లోపాలు బహిర్గతమైనట్లు యూనివర్సిటీలో చర్చసాగుతోంది. అయితే ఈ తనిఖీలకు సంబంధించిన నివేదికలను వెల్లడించకపోవడంతో ఆంతర్యమేమిటోనని పలు వురు ప్రశ్నిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం 2024-2025లో ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాల కోసం అనుమతులు ఇచ్చేందుకు రిజిస్ట్రార్ పి. మల్లారెడ్డి గత నెలలో రెండు బృందాలను నియమించిన విషయం విధితమే. సీడీసీ డీన్ వి.రాంచంద్రం, ఫార్మసీ కళాశాల బీఓఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కృష్ణవేణి, కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ప్రసాద్ ఒక బృందంగాను, కేయూ అకడమిక్ డీన్ జి. హనుమంతు, కేయూ ఫార్మసీ కళాశాల డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, సీనియర్ ప్రొఫెసర్ వై. నర్సింహారెడ్డి మరో బృందంగా నియమించారు. ఈ బృందాలు వేర్వేరుగా యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్‌లోని హనుమకొండ, జనగామ జిల్లాల్లో మొత్తం 22 ఫార్మసీ కళాశాలలను గత నెల 21 నుంచి 24 వరకు తనిఖీ చేశాయి. ఫార్మసీ కళాశాలల్లో నిబంధనల మేరకు అధ్యాపకులు పనిచేస్తున్నారా? విద్యార్థులకు అవసరమైన కోర్సులకు అనుగుణంగా ల్యాబ్స్ ఎక్విప్‌మెంట్లు ఉన్నాయా? లేవా? అనే విషయాలను పరిశీలించారు. ఎంఫార్మసీ , బీ ఫార్మసీ, ఫార్మ్-డి కోర్సులు నడవాలంటే అందుకు సరిపడా ఫ్యాకల్టీ ముఖ్యం. ఫ్యాకల్టీ ఉందా? లేదా? అనే విషయం కూడా పరిశీలించారని సమాచారం. అయితే పలు ఫార్మసీ కాలేజీల్లో అప్పటికప్పుడు కొందరి అధ్యాపకులను చూపినట్లు తనిఖీ బృందాలు గుర్తించాయని సమాచారం. పలు కళాశాలల్లో సరైన ల్యాబ్స్ కూడా లేవనే విషయం కూడా గుర్తించినట్లు యూనివర్సిటీలో చర్చ జరుగుతోంది. ఫార్మ్-డి కోర్సు నడవాలంటే 300 పడకలు కలిగిన ఏదైనా ఆస్పత్రితో ఎంఓయూ కలిగి ఉండాల్సింటుంది. కానీ పలు కళాశాలలకు ఆ విధంగా ఎంఓయూ లేదని వెల్లడైనట్లు సమాచారం.

బీఫార్మసీ, ఫార్మ్-డి కోర్సుల అనుమతులేవి?

కేయూ పరిధిలో 22 ప్రైవేటు ఫార్మసీ కళాశాలలను ఆయా బృందాలు తనిఖీ చేసి రెండు వారాలు గడిచాయి. మూడు మినహా మిగతా కళాశాలలకు ఎంఫార్మసీ కోర్సులకు అనుమతిచ్చాయి. 22 ప్రైవేటు ఫార్మసీ కళాశాలల్లో ఎన్నింట్లో బీఫార్మసీ కోర్సులకు అనుమతిస్తున్నారనే అంశం, అలాగే ఫార్మ్-డి కోర్సులకు ఎన్ని కళాశాలలకు అనుమతినిస్తున్నారనే విషయంపై ఇప్పటి వరకు తనిఖీ బృందాల నివేదిక బయటకు వెల్లడించలేదు. ఏఏ కళాశాలలకు బీఫార్మసీ, ఫార్మ్-డి కోర్సుల్లో ఎన్నీ సీట్లు ఇస్తున్నారనే విషయం వెల్లడించకుండా సంబంధిత యూనివర్సిటీ అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో యూనివర్సిటీ అధికారులు అనుమతుల విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారనేది కూడా ప్రైవేటు ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు ఉత్కంఠగా నిరీక్షిస్తున్నాయి. రెండు తనిఖీ బృందాలు తనిఖీచేశాక ఉన్నది ఉన్నట్లు రిపోర్టు రూపొందించి కూడా అనుమతుల ఇవ్వడంలో జాప్యం చేయడంలో ఆంతర్యమేమిటి అనేది యూనివర్సిటీలో చర్చగా మారింది.

ఎంఫార్మసీ కోర్సుకు మూడు కళాశాలలకు అనుమతి నిరాకరణ..

తొలుత కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎం ఫార్మసీ కోర్సులకు అనుమతినిస్తూ ఇటీవలే రాష్ట్ర ఉన్నత విద్యామండలికి ఆయా ఫార్మసీ కళాశాలల జాబితా పంపారు. అందులో ఖమ్మం జిల్లాకేంద్రంలోని మూడు ప్రైవేటు ఫార్మసీ కళాశాలలకు ఎం ఫార్మసీ కోర్సునకు అనుమతి నిరాకరించినట్లు వెల్లడైంది. అక్కడి మూడు కళాశాలల్లో అధ్యాపకులు, ల్యాబ్ ఎక్విప్‌మెంట్లు సరిగా లేకపోవడంతోనే అనుమతి నిరాకరించినట్లు కాకతీయ యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. అయితే ఆయా మూడు కళాశాలల యాజమాన్యాలు కేయూ ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో మరోసారి ఆయా మూడు ఫార్మసీ కళాశాలల తనిఖీకి అవకాశం ఇచ్చినట్లు సమాచారం. తొలుత వెళ్లిన తనిఖీ బృందం కాకుండా రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి కొత్తగా బృందాన్ని నియమించారు. కేయూ ఫార్మసీ కళాశాలకు చెందిన ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఒకరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో కూడిన మరో ముగ్గురి బృందంతో ఖమ్మంలోని ఆ మూడు ఫార్మసీ కళాశాలల్లో ఇటీవలే తనిఖీలు చేయించినట్లు సమాచారం. ఈ కమిటీ నివేదిక ఏ విధంగా ఇస్తుందనే విషయం చర్చగా ఉంది.

ఇంతలోనే సౌకర్యాలు ఏర్పాటు చేస్తారా?

ఒక బృందం తనిఖీ చేసిన రిపోర్టు ఆధారంగానే అనుమతులు నిరాకరించి మళ్లీ తనిఖీలు చేస్తే ఇంతలోనే ఆ మూడు ఫార్మసీ కళాశాలల్లో అధ్యాపకులు, ల్యాబ్స్‌ను ఏర్పాటు చేస్తారా అనే అంశం చర్చగా ఉంది. యూనివర్సిటీ పరిధిలో వివిధ ఫార్మసీ కళాశాలలు నిబంధనలకు అనుగుణంగా నడపడం లేదని, ఫార్మసీ విద్య మిథ్యగామారిందనే విషయం అధికారులకు తెలిసినా తమకేమిపట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

వరంగల్ మీదుగా 12 స్పెషల్ రైళ్లు

- ప్రయాగ్‌రాజ్-బెంగళూరు - ప్రయాగ్‌రాజ్ మధ్య రాకపోకలు

కాజీపేట రూరల్ : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వరంగల్ మీదుగా ప్రయాగ్‌రాజ్- ఎస్ ఎంవిటి బెంగళూరు-ప్రయాగ్‌రాజ్ మధ్య 12 స్పెషల్ రైళ్ల నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ప్రత్యేక రైళ్ల వివరాలు

ప్రయాగ్‌రాజ్-ఎస్ఎంటివిటి బెంగళూరు(04131) ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం అక్టోబర్ 13వ తేదీ నుంచి నవంబర్ 17వ తేదీ వరకు, ఎస్ఎంవిటి బెంగళూరు-ప్రయాగ్‌రాజ్ (04132) ఎక్స్‌ప్రెస్ ప్రతి బుధవారం అక్టోబర్ 16వ తేదీ నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు అప్ అండ్ డౌన్ రూట్‌లో 12 రైళ్ల సర్వీస్‌లను ప్రవేశపెట్టి నడిపిస్తున్నట్లు తెలిపారు. అప్ అండ్ డౌన్ రూట్‌లో మానిక్‌పూర్, సంత, కట్ని, జబల్‌పూర్, ఇటార్సీ, నాగ్‌పూర్, బల్లార్షా, సిర్పూర్‌కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల, వరంగల్, ఖమ్మం, విజయవాడ, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, పెరంబుదూర్, కాట్‌పడి, జోలర్‌పెట్టయ్, కృష్ణరాజపురం రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ కల్పించినట్లు వారు మంగళవారం తెలిపారు.

బతికుండగానే చనిపోయినట్లు ధ్రువీకరణ..

- తహసీల్దార్‌తోపాటు మరో నలుగురిపై కేసు

పర్వతగిరి : రైతు బతికి ఉండగానే చనిపోయినట్లు ధ్రువీకరణ చేసిన తహసీల్దార్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బోగం ప్రవీణ్ మంగళవారం తెలిపారు. 2023లో అజ్మీరా కోమి పర్వతగిరి తహసీల్దార్‌గా పనిచేశారు. ఈ క్రమంలో వడ్లకొండ గ్రామానికి చెందిన ఎర్రం మల్లయ్యకు చెందిన ఎకరం 25గుంటల భూమిని అదే గ్రామానికి చెందిన తన బంధువు ఎర్రం దూడయ్యకు పట్టాచేశారు. తాను బతికుండగానే చనిపోయినట్లు ధ్రువీకరించి, పట్టా చేసిన అప్పటి తహసీల్దార్ కోమితోపాటు ఎర్రం దూడయ్య, సహకరించిన గ్రామస్తులు వెంకటేశ్వర్లు, రాజు, అప్సర్‌పాషాపై చర్యలు తీసుకోవాలని ఎర్రం మల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బోగం ప్రవీణ్ తెలిపారు.

12న మినీ జాబ్‌మేళా

వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం ఈనెల 12వ తేదీన వరంగల్ ములుగురోడ్డు సమీపంలోని ఐటీఐ గర్ల్స్ క్యాంపస్ మినీజాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వరంగల్ ఉపాధి కల్పన అధి కారి ఉమారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేళాలో హెచ్‌డీఎఫ్‌సీ, యస్‌బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ, ముత్తూట్(7093168464), శ్రీరామ్ లైఫ్(98010 27897)నంబర్లను సంప్రదించాలన్నారు.

కేయూలో భూముల పరిశీలన

- ఆక్రమణల ఆరోపణలపై వివిధశాఖలతో కలిసి విజిలెన్స్ అధికారులు జాయింట్ ఇన్‌స్పెక్షన్



కేయూలోని బీసీ కాలనీలో భూముల ఇన్‌స్పెక్షన్ చేస్తున్న అధికారులు



విజిలెన్స్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వివిధ చోట్ల భూముల ఆక్రమణల ఆరోపణల ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. విజిలెన్స్ అధికారులు మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ సర్వేయర్ల అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేస్తుంది. మంగళవారం యూనివర్సిటీలోని న్యూ పీజీ హాస్టల్ బీసీ కాలనీ ప్రాంతంలోని 229 సర్వే నంబర్ భూమిలో కొన్నేళ్ల క్రితమే ఆక్రమణలు జరిగాయన్న ఆరోపణల ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ సర్వేయర్లు, కేయూ బిల్డింగ్ డివిజన్ అధికారులతో కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేశారు. 229 సర్వే నంబర్‌లో యూనివర్సిటీకి చెందిన ఇద్దరు ముగ్గురు ఉద్యోగులు, మరికొందరు ఇళ్లు ఉన్నాయనే ఆరోపణలున్నాయని తెలుస్తోంది. ఇటీవల సంబంధిత అధికారులు ఆయా ఇంటి యాజమానులకు నోటీస్‌లు కూడా జారీ చేశారని సమాచారం. మంగళవారం విజిలెన్స్ అధికారులు, మున్సిపల్, రెవెన్యూ అధికారుల సర్వేయర్లతో అక్కడికి చేరుకొని అందరి నివాసితుల సమక్షంలో సర్వే చేపట్టారు. అక్కడికి విజిలెన్స్ అధికారులు ఇతర శాఖల అధికారుల సిబ్బంది బృందం చేరుకోగా అక్కడ నివాసం ఉంటున్న ఇంటి యాజమానులు అక్కడికి చేరుకున్నారు. వీరు తమ భూమి సర్వే నంబర్లు వేర్వేరుగా ఉన్నాయని 229 సర్వేనంబర్‌లో తమ ఇళ్లు లేవని, తాము గత కొన్నేళ్ల క్రితం కొనుగోలు చేసినట్లు చెబుతున్నారని సమాచారం. తమభూమికి సంబంధించిన పత్రాలు కొందరు ఇంటి యజమానులు భూమి పత్రాలు సంబంధిత విజిలెన్స్ అధికారులకు, రెవెన్యూ, సర్వేయర్లకు చూపించారని సమాచారం. కేయూ బిల్డింగ్ డివిజన్ అధికారులు మాత్రం 229 సర్వేనంబర్ భూమి ఆరు ఎకరాల 15 గుంటల భూమి ఉన్నట్లుగా రికార్డుల్లో ఉందన్నారు. అంతభూమి ఇప్పుడు కూడా ఉండాల్సి ఉంటుందని యూనివర్సిటీ భూమికి సంబంధించిన మ్యాప్‌ను కూడా విజిలెన్స్ అధికారులకు చూపించినట్లు బిల్డింగ్ డివిజన్ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు ఈ ప్రాంతంలో భూమిని సర్వేను నిర్వహిస్తే వాస్తవాలు వెలుగులోని వస్తాయని భావిస్తున్నారు. ఈ సర్వే అనంతరం అధికారులు ఇచ్చే రిపోర్టును బట్టి తదుపరి చర్యలు ఉంటాయని భావిస్తున్నారు. ఇప్పటికే విజిలెన్స్ వివిధ శాఖలతో కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ ఇటీవలనే యూనివర్సిటీలోని పలివేల్పుల శివారు 412, 413, 414 సర్వేనంబర్లలో అలాగే లష్కర్‌సింగారం శివారు 34 సర్వేనంబర్‌లో కూడా కొంతమేర ఆక్రమణలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ ఆయా శాఖల జాయింట్ ఇన్‌స్పెక్షన్ జరిగింది. ఆయా సర్వేనెంబర్ల భూముల్లో ఇంకా కొనసాగేది ఉందని భావిస్తున్నారు.

కేయూ భూములపై సమగ్ర విచారణ జరపాలి

కాకతీయ యూనివర్సిటీకి సంబంధించిన భూములపై విచారణ సమగ్రంగా పారదర్శకంగా జరపాలని పలు చోట్ల భూములు ఆక్రమణలకు గురయ్యాయని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్ఎస్‌వీ) కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర విజిలెన్స్ అధికారులకు విన్నవించారు. మంగళవారం కేయూలో విజిలెన్స్ అధికారులు వివిధ శాఖల మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ సర్వేయర్ల అధికారులు కేయూ బిల్డింగ్ డివిజన్ అధికారుల బృందం ఇన్‌స్పెక్షన్ చేసేందుకు రాగా అక్కడ విజిలెన్స్ అధికారి రాకేశ్‌ను కలిసి విన్నవించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజిలెన్స్‌పై తమకు పూర్తిగా నమ్మకం ఉందన్నారు. కేయూకు సంబంధించిన పలివేల్పుల, లష్కర్‌సింగారం, పలు సర్వే నంబర్ల భూముల్లో ఇప్పటికే ఆక్రమణలు జరిగాయన్నారు. భూకబ్జాలు, ఆక్రమణలు నిర్మాణాలపై ఎలాంటి రాజకీయ ఒత్తిడిలకు గురి కాకుండా విచారణ కొనసాగించాలన్నారు. భూముల పరిరక్షణకోసం గతంలో డాక్టర్ నాగేందర్ బాబు ఆధ్వర్యంలో ల్యాండ్ కమిటీ ఇచ్చిన రిపోర్టును కూడా పరిగణలోనికి తీసుకోవాలని విజిలెన్స్ అధికారులను కోరినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్‌వీ నాయకులు గొల్లపెల్లి వీరస్వామి, కందికొండ తిరుపతి, రత్నం, అశోక్ తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు ప్రభుత్వం అండ

- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: వరద బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి వరదలో పడి మృతి చెందిన మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన గుండాల నర్సయ్య కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని, వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సోమరాజశేఖర్, మంగళపెల్లి రామచంద్రయ్య, పెదగాని సోమయ్య, చిత్తలూరి శ్రీనివాస్, మేరుగు మల్లేశంగౌడ్, మొగుళ్ల లింగన్న, వెంకన్న, మల్లయ్య, హుస్సేన్ పాల్గొన్నారు.

ఉద్యోగిపై దాడికి పాల్పడిన మహిళ అరెస్ట్

రామన్నపేట : ఎంజీఎంలో విధులకు వెళ్తున్న ఉద్యోగిని అడ్డగించి బెదిరించి దాడికి పాల్పడిన మహిళను అరెస్ట్ చేసినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ టి.గోపి మంగళవారం తెలిపారు. ఇన్‌స్పెక్టర్ గోపి కథనం ప్రకారం.. బిల్ల సుమలత 15 సంవత్సరాల నుంచి ఎంజీఎంలో ఔట్‌సోర్సింగ్‌గా, రెండు సంవత్సరాల నుంచి పేషెంట్ కేర్‌గా ఉద్యోగం చేస్తోంది. ఈనెల 9న మధ్యాహ్నం షిఫ్ట్ విధుల్లో భాగంగా ఎంజీఎంలోని బయోమెట్రిక్ మెషీన్ వద్దకు వచ్చి హాజరు వేస్తుండగా ఆలకుంట రాజమ్మ.. సుమలతను అడ్డుకుంది. 'నీ నియామకానికి జీఓ తెచ్చింది నేనే.. అందుకే రూ.2 లక్షలు లంచం ఇస్తావా లేదా..లేకుంటే నిన్ను చంపేస్తా' అంటూ బెదిరిస్తూ చైన్‌తో విచక్షణరహితంగా సుమలతను కొడుతూ తన వద్ద ఉన్న రూ.10 వేలు లాక్కుంది. ఈ ఘటనపై బాధితురాలు సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితురాలు ఆలకుంట రాజమ్మ అరెస్ట్ చేసి ఆమె నుంచి రూ.వెయ్యి , నేరానికి ఉపయోగించిన చైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితురాలిని రిమాండ్ తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు.

ఎంజీఎం ఘటనపై దోషులను శిక్షించాలి: ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి ఉద్యోగి సుమలతపై దాడికి పాల్పడిన దోషులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం అధికారులను ఆదేశించారు. సుమలతపై దాడికి పాల్పడిన రాజమ్మ గతంలో ఎంజీఎంలో విధులు నిర్వర్తించినప్పటికీ తనపై ఉన్న అభియోగాల నేపథ్యంలో విధుల నుంచి తొలగించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలను ఉపేక్షించేది లేదని, నిందితులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో వైద్యులు, సిబ్బందిపై ఇలాంటి ఘటనలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేసి కేసు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

జీతం కట్ చేసే హక్కు జేఏసీకి ఎక్కడిది?

- తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవి

హన్మకొండ: ఉద్యోగి జీతం కట్ చేసే హక్కు ఉద్యోగ జేఏసీకి ఎక్కడిదని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్లి రవి ప్రశ్నించారు. ఉద్యోగుల హక్కులు సాధించలేని, సమస్యలు పరిష్కరించలేని వారు ఉద్యోగుల ఒక రోజు మూలవేతనాన్ని సీఎం సహాయనిధికి ఎలా ఇస్తామని చెబుతారని ఆయన ఒక ప్రకటనలో నిలదీశారు. ఇతర ఉద్యోగ సంఘాలతో జిల్లాల వారీగా ఒక్క మీటింగ్ కూడా నిర్వహించకుండా, ఉద్యోగుల సలహాలు, అంగీకారం స్వీకరించకుడానే ఎలా మాటిస్తారని ప్రశ్నించారు. రెవెన్యూ శాఖలో పని చేస్తున్న సీనియర్ సహాయకులు, గిర్దావర్‌లు, జూనియర్ సహాయకులు, టైపిస్ట్‌లు, స్టెనో కం టైపిస్ట్‌లు, ప్రభుత్వ డ్రైవర్లు, రికార్డు అసిస్టెంట్లు, చైన్‌మెన్‌లు, ఆఫీస్ సబార్డినేట్‌లు, వాచ్‌మెన్‌లున్న అతి పెద్ద సంఘం తమదన్నారు. ఇంత పెద్ద సంఘంతో సంప్రదించకుండా సీఎం సహాయనిధికి రూ.100 కోట్లు ఇస్తామని ఒక జేఏసీ నాయకుడు, రూ.130 కోట్లు ఇస్తామని మరో జేఏసీ నాయకుడు పోటీపడి చెబుతున్నారన్నారు. సహాయం ప్రకటించే ముందు జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించి ఉద్యోగుల అభిప్రాయం తీసుకున్నారా అని ప్రశ్నించారు. ఈ జేఏసీ నాయకులు ఉద్యోగుల హక్కుల గురించి ఎందుకు అడగడం లేదని, ఇంత వరకు పీఆర్సీ సాధించలేదని, 5 డీఏలు ఇప్పించలేదని విమర్శించారు. రాష్ట్ర చరిత్రలో ఇంత తక్కువగా 5 శాతం ఐఆర్ ఏనాడు ఇవ్వలేదని, ఈ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులు విడుదల చేయడం లేదని తూర్పారబట్టారు. తమవి గొప్ప సంఘాలు అన్ని చెప్పుకుంటున్న నాయకులు ఆ సంఘాల సభ్యుల నుంచి జీతం కట్ చేసుకుని సీఎం సహాయ నిధికి ఇవ్వాలని, తమ సంఘంలోని సభ్యుల జీతాలు తాము కట్ చేసుకుని సీఎం సహాయ నిధికి చెల్లిస్తామన్నారు. తమ సంఘం వంద శాతం ప్రభుత్వానికి అనుకూలంగా పని చేసిందని, ఇక ముందు కూడా పని చేస్తుందని స్పష్టం చేశారు.

వచ్చే ఎన్నికల్లో డబ్బులు ఇవ్వొద్దు..మద్యం తాగించొద్దు

- బిచ్యానాయక్‌తండా జీపీలో ఫ్లెక్సీ ఏర్పాటు
- చర్చనీయాంశమైన ఘటన



బిచ్యానాయక్‌తండాజీపీలో ఓ చోట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కేసముద్రం: వచ్చే సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థులు, గ్రామ ఓటర్లకు డబ్బులు ఇవ్వొద్దు, మద్యం తాగించొద్దు అంటూ మండలంలోని బిచ్యానాయక్‌తండా జీపీ శివారు రాజీవ్‌నగర్ తండాలో గ్రామ కమిటీ కుర్రాళ్ల పేరిట గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ విషయం చర్చనీయాంశమైంది. 'అభ్యర్థులు ఎలక్షన్‌లో పోటీచేస్తే చేయండి.. కానీ ఓటర్లకు డబ్బులు ఇవ్వడం, మీ వెంట తిప్పి మద్యం తాపించి, తినిపించి గ్రామప్రజలను తాగుబోతులుగా మార్చకండి. నిజాయితీగా మీ రాజకీయాలు చేసుకోండి.. అంతలా డబ్బులు ఖర్చు చేయాలనిపిస్తే గ్రామంలో ఏదైనా మంచిపని చేసి చూపించండి. కాదు కూడదని మీరు ఊరిని ఆగం చేయాలని చూస్తే ఏ మాత్రం సహించేదిలేదని, ఆధారాలు సేకరించి పోలీసులకు పట్టిస్తాం జాగ్రత్త' అంటూ ఫ్లెక్సీపై హెచ్చరిక పేరిట ప్రింట్ చేయించారు. ఈ ఫ్లెక్సీ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

లక్ష్మీప్రసన్న ఫైర్ వర్క్‌షాపులో తనిఖీ

- రూ.5లక్షల విలువైన టపాసులు సీజ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాంనాయక్



ఫైర్‌వర్క్‌షాపును తనిఖీ చేస్తున్న ఏసీపీ నందిరాం నాయక్

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం సాకరాశికుంటలోని మంచాల లక్ష్మీప్రసన్న ఫైర్ వర్క్ షాపును మంగళవారం రాత్రి వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా ఫైర్ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో నిర్వాహకులపై కేసు నమోదు చేసి అనుమతులు లేని సుమారు రూ.5లక్షల విలువైన టపాసుల స్టాక్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ నందిరాంనాయక్ మాట్లాడుతూ జనవాసాల్లో ఎలాంటి అనుమతిలేకుండా ఫైర్ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో తెలిసిందన్నారు. దీంతో రూ. 5లక్షల విలువైన స్టాక్‌ను సీజ్ చేశామని చెప్పారు. అనుమతులు లేకుండా ప్రమాదకరమైన ఫైర్ వర్క్‌షాపు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు చందర్,శ్రీకాంత్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు

బైక్‌ను ఢీకొన్న ట్రాలీ ఆటో..

- వ్యక్తి మృతి..పెద్దవంగరలో ఘటన



వెంకన్న (ఫైల్)

పెద్దవంగర: ట్రాలీ ఆటో.. బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండల పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన శ్రీరాం వెంకన్న (48) నాయీబ్రాహ్మణ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం మండల కేంద్రంలో బంధువును బస్సు ఎక్కించాడు. తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొంది. దీంతో వెంకన్నకు తీవ్ర గాయాలుకావడంతో స్థానికులు హుటాహుటిన తొర్రూరులోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య శోభ, కుమారుడు సాంబ ఉన్నాడు. కాగా, ఈ ఘటనలో ట్రాలీ ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నట్లు సమాచారం.

ఓబుల్‌కేశావాపూర్‌లో బైక్ నుంచి పడి యువకుడు ..

జనగామ రూరల్: బైక్‌పైనుంచి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని ఓబుల్‌కేశావాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బడికే నరేశ్ (30) తన అత్తగారి గ్రామం చిన్నరాంచర్లలో నివాసం ఉంటున్నాడు. జనగామలోని యశ్వాంతాపూర్‌లో ఓ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. ఎప్పటి లాగే పని ముగించుకుని బైక్ పై చిన్న రాంచర్లలోని తన అత్తగారింటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఓబుల్‌కేశావాపూర్‌లో బైక్ అదుపుతప్పి కిందపడగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సింధు, కూతురు, కుమారుడు ఉన్నాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET

WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్ రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. కిరాయి రూ॥ 10 వేలు. సంప్ర॥ 9848696291. [W-1239979]

PLOT FOR SALE

HNK, KITS College అంబాల రోడ్డు & ముచ్చర్ల రోడ్డు కొత్తగా వస్తున్న హైవే రోడ్డు దగ్గరలో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మబడును. సంప్ర॥ 9553255936. [W-1239961]

SERVICES

వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును, సిబిల్ అవసరం లేదు, NPA కూడా, దరఖాస్తు, హన్మకొండ ✆ 8790379618. [WA-6522]

CHANGE OF NAME

I, TALLURI MANASA, D/o. SHESHAGIRI RAO (Old Name), R/o. 19-148, Sanjay Gandhi Nagar, Nekkonda Road, Narsampet, Warangal Rural Pin: 506132,Telangana have changed my name as POKA MANASA, D/o SHESHAGIRI RAO (New Name), R/o. H.No.1-94, Gunturpally Village, Gadepalle, Sangam Mandal, Warangal district - 506005 [W-1239980]

I, V N N S J SRIREKHA DASU (Old Name), R/o.2-7-117/1, Road No. 1-J, Bhavani Nagar, Hanamkonda, Dist: Hanamkonda, Pin code-506001, T.S., India has been changed my name V N N S J SRIREKHA DASU to PALLERLA SRILEKHA (New Name) for all future purposes. [W-1264998]

FINANCE SERVICES

సిరి అసోసియేట్స్: అన్ని రకాల రుణాలు, పర్సనల్, హౌసింగ్, మార్టగేజ్, ఓపెన్ ప్లాట్స్‌పై & రిజిస్ట్రేషన్ చేయించి రుణాలు ఇప్పించబడును. సిబిల్ ప్రాబ్లం ఉన్నా చేయించబడును. 9666142226. [W-1239958]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/-
అదనపు లైను రూ॥ 60/- మాత్రమే
5% GST అదనము

BUSINESS OFFER

ICF కార్పొరేషన్ అగ్రికల్చర్ పర్సనల్ ఎడ్యుకేషన్ ప్రాపర్టీ పై లోన్స్ ఏజెంట్స్ DMA కావలెను. జీతం+ కమీషన్. ఫోన్ : 7988242391 [SCA-24000238]

WANTED

మీ ఇంటివద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డ్స్ రాయటం స్త్రీ/పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం 12,000/- ఫోన్ 70756 56208. [V-6557]

త్రినేత్రహోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 17K. Ph : 8520874499, 8520980099 [H-796274]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.